క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది

ఇబ్రహీంపట్నం : ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది వేతనాలను ప్రతి నెల ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ మహేశ్వర్‌కు కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఏపీఎం శంకర్, ఐడీసీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, భగీరథ ఏఈ మల్లేషం, ఆర్‌డబ్ల్యూఎస్ అఖిల్, ఏఈవో శ్యామ్, ఎపీయంవో శ్రీనివాస్, కారొబార్, బిల్ కలెక్టర్ల సిబ్బంది సంఘం అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యాక్షుడు నిరేటి రతన్, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం గ్రంథాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న పాలెపు జీవన్

రాయికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగం గ్రంథాలను ఉచితంగా ప్రతి ఒక్కరికీ పంపిణీ చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాలెపు జీవన్ మాట్లాడుతూ, ప్రతి పౌరడికి భారత రాజ్యాంగం గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేసి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీవన్ మహరాజ్, స్వామి, రంజిత్, పవన్, రాజగణేశ్, ప్రణయ్, మనోజ్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించే దేవత విగ్రహాలను గ్రామం నుంచి కొత్తగా నిర్మించిన ఆలయం వరకు మంగళహారతులతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. మహాగణపతి పూజ, ఎల్లమ్మ లంద పూజ నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో నిర్వాహకులు, గ్రామస్తులు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠ కోసం విరాళం



కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో అతి పురాతన భీమన్న ఆలయ పునఃప్రతిష్ఠ కోసం అయిలాపూర్ కు చెందిన బంగిసరావు శ్రీకాంత్–లక్ష్మి దంపతులు సోమవారం రూ.50,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు శ్రీకాంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, నాయకులు ప్రశాంత్, సత్యనారాయణ, శ్రీను, రాజేందర్, మధు, పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

మల్లాపూర్: మండలంలోని హుసేన్సేన్‌నగర్‌లో సోమవారం రాత్రి ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం నిర్మల్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ఖానాపూర్ నుంచి మెట్‌పల్లికి చేరుకుని తిరిగి వెళ్తుండగా, పాతబస్టాండ్ వద్ద హుస్సేన్‌నగర్‌కి చెందిన ఆటోడ్రైవర్ షేక్ హుస్సేన్ ఆటోని ఢీ కొట్టిందన్న కారణంతో ఆర్టీసీ బస్సు హుస్సేన్‌నగర్‌కు చేరుకోగానే హుస్సేన్‌తో పాటు అతని అన్న హసన్‌లు అడ్డుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్ మోర్తాడ్ అశోక్‌పై దాడి చేశారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డారని హుస్సేన్, హసన్‌లపై ఆర్టీసీ డ్రైవర్ అశోక్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులకు ఆటంకం కలిగించినా, దాడి చేసినా, వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

గ్రామ పంచాయతీల్లో కుంటుపడిన పాలన

- జిల్లాలో సమ్మె చేస్తున్న 282 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- సమ్మెకు దిగిన 1543 మంది పారిశుధ్య కార్మికులు
- గ్రామాల్లో పేరుకు పోతున్న సమస్యలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారుల దృష్టి



సారంగాపూర్‌లో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్/ కోరుట్ల రూరల్/ సారంగాపూర్: పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, కారొబార్ల సమ్మెతో గ్రామ పంచాయతీల పాలన కుంటుపడుతోంది. గత 8 రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులరైజేషన్ చేయాలని సమ్మె చేస్తుండగా, జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సైతం తమ డిమాండ్లను నెరవేర్చాలని శనివారం నుంచి సమ్మెకు దిగారు. దీంతో జిల్లాలో గ్రామపంచాయతీల పాలన కుంటుపడుతోంది. జిల్లాలో 380 గ్రామపంచాయతీలుండగా ఇప్పటికే 282 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో గ్రామాల్లో 8 రోజులుగా కార్యదర్శులు అందుబాటులో లేక పాలన అస్తవ్యస్తంగా మారింది.

సమ్మెకు దిగిన పారిశుధ్య కార్మికులు

రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పూర్తిగా పట్టించుకోవడం లేదని జిల్లా వ్యాప్తంగా 1543 మంది పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారింది. వీధిదీపాల ఏర్పాటు, పారిశుధ్య పనుల నిర్వహణ, నీటి సరఫరా పనుల్లో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. సమ్మె ఇలాగే కొనసాగిస్తే గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి.

నిరవధిక సమ్మెతో ఇక్కట్లు

కార్యదర్శుల సమ్మెతో గత 10 రోజులుగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. గ్రామ పంచాయతీల నుంచి పొందే వ్యక్తిగత సర్టిఫికెట్ల జారీ కోసం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కార్యదర్శుల సమ్మెతో గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారుల దృష్టి

జిల్లా వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు సమ్మె కొనసాగిస్తుండటంతో జిల్లా అధికార యంత్రాంగం గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఎంపీవో, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ వారు గ్రామాలకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ఖర్చు ఎలా చేయడమనేది తర్జన భర్జన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్మికులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



జగిత్యాల రూరల్: నిరసన దీక్షలో కార్యదర్శులు

కార్యదర్శుల డిమాండ్లను నెరవేర్చాలి



పంచాయతీ కార్యదర్శుల సమ్మె కారణంగా గ్రామాల్లో చాలా సమస్యలు వస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శుల స్థానంలో గ్రామానికి ఓ అధికారిని నియమించిన పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కార్యదర్శులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలి.

– గుడిసె శ్రీమతి, సర్పంచ్ తుంగూర్, బీర్‌పూర్

ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలి



నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా మూడేళ్లు పని చేశాం, మళ్లీ మరో ఏడాది చేయాలని ప్రభుత్వం జీవో 26 విడుదల చేసినా పని చేశాం ఆ గడువు కూడా గత నెల ముగిసింది. ఇప్పటికీ తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణపై స్పష్టత లేదు.గ్రామాల అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నాం ప్రభుత్వం వెంటనే మా ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలి.

– శ్రీకాంత్, జేపీఎస్, సంగెం

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం



జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె కొనసాగిస్తున్నారు. కానీ పారిశుధ్య కార్మికులు కూడా సమ్మె చేస్తున్నట్లు తెలిసింది. తమకు మాత్రం సమ్మె చేస్తున్నట్లు ఏలాంటి నోటీసు ఇవ్వలేదు. దీంతో గ్రామపంచాయతీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాం.

– నరేశ్, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి, జగిత్యాల

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అల్లీపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో మన ఊరు మన బడి కార్యక్రమంలో రూ.1.29 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని, మన ఊరు మన బడితో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారెడ్డి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, ఉపసర్పంచ్ సాగర్‌రావు, విద్యాకమిటీ చైర్మన్ కల్యాణి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బీరప్ప స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పట్నాల సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గొల్ల కుర్మలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు ఆహ్వానం

ధర్మపురి: సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు పేర్లు నమోదు నమోదు చేసుకోవాలని ఎంపీపీ చిట్టిబాబు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆటల పోటీల నిర్వహణ గురించి చర్చించారు. 15 నుంచి 36 ఏళ్ల లోపు వయస్సు గలవారు ఈ నెల 16,17 తేదీల్లో స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో బత్తుల భూమయ్య, ఎంపీవో నరేశ్, పీఈటీ టీచర్ అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఈ నెల 15 నుంచి 17వరకు మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడల్లో కబడ్డీలో మహిళలకు, పురుషులకు, ఖోఖోలో పురుషులకు, మహిళలకు, వాలీబాల్‌లో పురుషులకు, మహిళలకు వేరువేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్ (పురుషులకు),అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు రన్నింగ్ పురుషులకు, మహిళలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 11న సాయంత్రం 5 గంటలలోపు మండల పరిషత్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

అర్బన్ కాలనీలో ఇంటింటికీ సంజయ్



బీడీ కార్మికులతో ముచ్చటిస్తున్న డాక్టర్ సంజయ్

కోరుట్ల: పట్టణ శివారులోని అర్బన్ కాలనీలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం 'మన ఇంటికే మన సంజయ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సరిగా అందుతున్నాయా లేదా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ ఇల్లూ తిరిగి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించటంతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా తెలుసుకోవాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎలిశెట్టి భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

మేడిపెల్లి: పంచాయతీ సిబ్బంది,కారోబార్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బందికి మండల బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథరెడ్డి, ఎస్ఎన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా వెంకటేశ్

వెల్గటూర్: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ గా మండల కో ఆర్డినేటర్‌గా నియమించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెట్టెం నవీన్‌కు, తన ఎన్నికకు సహకరించిన డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గాజుల నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు జలజకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షురాలిగా సరిత

మల్లాపూర్: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షురాలిగా ఇనుగుర్తి సరిత(రేగుంట)ను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ తెలిపారు. సోమవారం సరితకు నియామక పత్రం అందజేసి, బీసీ సమస్యలపై పోరాడాలని సూచించారు.

గుండెపోటుతో మహిళ మృతి

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన ఎర్రొల్ల రాజవ్వ(52) అనే మహిళ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. రోజులాగే నిద్రలేచి ఇంటిపనులు చేసుకుంటుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఉన్నచోటే కుప్పకూలిపోగా, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 కు ఫోన్ చేయగా వారు వచ్చి చూసి అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు.సీపీఆర్ చేసినా ప్రాణాలు నిలవలేదని కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉంది.

నంబర్ లేని వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న ఎస్సై సతీశ్‌కుమార్

కోరుట్ల రూరల్: నంబర్ ప్లేటు లేని వాహనాలను కాని నడపొద్దని ఎస్సై సతీశ్ కుమార్ అన్నారు. మండలంలోని సంగెంలో సోమవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే ఉపేక్షించబోమన్నారు. వాహనాలు నడిపేటపుడు భద్రంగా నడపాలని ప్రాణం ఎంతో విలువైనదన్నారు. నంబర్ లేని వాహనాలు నడిపిస్తే ఎదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్సు వర్తించదని తెలిపారు. వాహనాలు జాగ్రత్తగా నడిపి సురక్షింగా ఇంటికి చేరుకోవాలని, వేగం కంటే ప్రాణం ఎంతో విలువైనదని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెప్యాల నర్సయ్య, ఉప సర్పంచ్ సాగరిక, జక్కని గణేశ్, రైతుబంధు అధ్యక్షుడు భూమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారోబార్ కుటుంబానికి గ్రామస్తుల చేయూత



డిపాజిట్ బాండ్ అందిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామానికి చెందిన కారోబార్ వంగరి లింగేశ్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, సోమవారం బాధిత కుటుంబానికి గ్రామస్తులు రూ. 1.50 లక్షలు ఆర్థిక సాయం అందించారు. గ్రామస్తులంతా కలిసి డబ్బులు సేకరించగా.. రూ. 1.50 లక్షలు సమకూరాయి. వీటిని బాధితుడి కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందించినట్లు సర్పంచ్ దయ్య లక్ష్మినర్సయ్య తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ధర్మపురి: బీర్‌పూర్ మండలంలోని తుంగూరు గ్రామానికి చెందిన దేషారాజుల శ్రీనివాస్ వెల్డింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడికి వెల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాస్ వెల్డింగ్ పనులు చేస్తు జీవనోపాధి పొందుతున్నాడు. ఇటీవల ధర్మపురిలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటిలో షెడ్డు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడగా కాలు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడికి వెల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ బాబా ఆధ్వర్యంలో రూ.12,211 ఆర్థిక సాయం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు దామెరకొండ శ్రీనివాస్, విలాసాగర్, లక్ష్మీరాజం తదితరులున్నారు.

తరుగు పేరుతో అధిక కోతలు సరికాదు

కోరుట్ల: అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని తరుగు పేరుతో అధిక కోతలు పెట్టవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని అయిలాపూర్, సంగెం, యెఖీన్‌పూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు రాజ గణేశ్ విజయ్ కుమార్, మహాదేవ్, తెడ్డు రాజం, ఐలయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులను క్రమబద్ధీకరించాలి

మల్లాపూర్: గ్రామపంచాయతీల కారోబార్లు, పంప్ఆపరేటర్లు, పారిశుధ్య కార్మికులు, పార్ట్‌టైం వర్కర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని టీడీపీ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్, నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన సంఘీభావం ప్రకటించారు. వారి డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ. సాదుల్లా, నాయకులు నిమ్మల రాములు, మేడిపట్ల అశోక్, నకినపెల్లి సాయిలు, నూనె రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో కార్యదర్శుల నిరసన





ఇబ్రహీంపట్నంలో బతుకమ్మతో కార్యదర్శుల నిరసన కోరుట్లరూరల్: యోగాసనాలతో నిరసన

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేసేంత వరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జగిత్యాల మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. సోమవారం బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి ప్రసాద్ రావు తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆట ఆడి కార్యదర్శులు నిరసన తెలిపారు. అనంతరం బతుకమ్మలను ఎస్సారెస్పీ కాలువలో నిమజ్జనం చేశారు.

వంటావార్పుతో కార్యదర్శుల నిరసన

రాయికల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు అక్బర్, వేణు, అపర్ణ, రాజశ్రీ, నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం: మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు బతుకమ్మ ఆటలు ఆడి నిరసన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

కోరుట్ల రూరల్: జూనియర్ పంచాయితీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరింది. సోమవారం యోగాసనాలు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పృథ్వీ, కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కంటివెలుగుతో అంధత్వాన్ని రూపుమాపుదాం

మల్లాపూర్: కంటివెలుగుతో అంధత్వాన్ని రూపుమాపుదామని ఇన్‌చార్జి ఎంపీడీవో జగదీష్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని సిరిపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని, కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రాహుల్‌శర్మ, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి వచ్చిన కళ్లద్దాలను సర్పంచ్ నేమూరి లత సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వైద్యాధికారి హరీశ్, హెల్త్ సూపర్‌వైజర్ ఉష, డీఈవో రాజశ్రీ, కార్యదర్శి నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

దేశంలోని ప్రతీ పౌరుడు నాయకుడిగా ఎదగాలి

వెల్గటూర్: దేశంలోని ప్రతీ వ్యక్తి నాయకుడిగా ఎదగాలని న్యూ ఇండియా పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జనగామ తిరుపతి అన్నారు. దేశంలోని వ్యక్తులందరికీ ఆర్థిక స్వేచ్ఛ లభించాలనే లక్ష్యంతో చేపట్టిన ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర సోమవారం వెల్గటూర్ మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. దళితబంధు లాగా ఎస్టీ, బీసీలకు కూడా లబ్ధి చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు శ్రీమతి గంటా బబిత, ఎం గోపాల్, జనగామ లక్ష్మీనారాయణ, ధర్మపురి నియోజకవర్గ నాయకులు మోతె నరేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

ధర్మపురి: మేత కోసమని వెళ్లిన మేకపై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన ఎంకుసు గంగన్న అనే రైతు సోమవారం మేత కోసమని మేకల మందను తీసుకెళ్లాడు. బుద్దేశ్‌పల్లె సమీపంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి మేకపై పడడంతో విద్యుత్‌ఘాతంతో మృతి చెందింది. మేక విలువ రూ.12 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

ఆర్థికసాయం అందజేత

మేడిపెల్లి: కోనాపూర్ గ్రామ శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మేడిపెల్లి మండలానికి చెందిన ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా వారి కుటుంబసభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అంకం సాగర్, దేశవేని క్రిష్ణ, పల్లి అర్జున్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల మండలం చల్‌గల్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. చల్‌గల్ సెక్షన్ పరిధిలోని చల్‌గల్, మోరపల్లి, తాటిపల్లి, చెర్లపల్లి, హస్నాబాద్, అంబారిపేట, అంతర్గాం, ఒడ్డెరకాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.